క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన కళాకారులు



తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న కళా సమితి నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభ్యుదయ కళాసేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య మద్దెల శివకుమార్ అధ్వర్యంలో గురువారం ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. మద్దెల మాట్లాడుతూ.. తుమ్మల గెలుపు, మంత్రి పదవి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అందెల ఆనందరావు, గొల్లపల్లి దయానంద్, పోకల కిరణ్, గిడ్ల పరంజ్యోతి, ఆంతోటి పాల్, అనంత మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మండల విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిరాణి, శ్రీనగర్ కాలనీ సర్పంచ్ పూనెం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ లగడపాటి రమేష్, ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, దివ్యాంగుల జేఏసీ చైర్మన్ గుండపునేని సతీష్, విద్యా కమిటీ చైర్మన్ చాంద్‌పాషా, టీచర్లు శౌరి, ఇన్నయ్య, షాజియా తబ్సుమ్, టీచర్ జానకి, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో యూడైస్ పరిశీలన



వివరాలను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధి రామవరం కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభుదయాళ్ యూడైస్ వివరాలను పరిశీలించారు. డైస్‌లో నమోదు చేసిన వివరాలు, ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, అమలు అవుతున్న పథకాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వివరాలను డైస్‌లో నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతున్న సీహెచ్ మహేష్ ఈనెల 14, 15 తేదీలలో జరిగిన కాకతీయ యూనివర్సిటీ వాలీబాల్ సెలక్షన్స్‌లో కాకతీయ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హావీలా తెలిపారు. మహేష్‌ను కళాశాల పిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాస్‌రావు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి 25 వరకు కర్ణాటక రాష్ట్రంలో బెల్గాంలో జరగనున్న సౌత్ జోన్ అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

బాధిత కుటుంబానికి వితరణ



ఆర్థిక సాయం అందజేస్తున్న రమణారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోడ హరి గత నెల 24న రోడ్డు ప్రమాదానికి గురై ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈనెల 5న 'ఆపన్నహస్తం అందించండి'అనే శీర్షికన సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. ఇప్పటికే పలువురు దాతలు, అయ్యప్ప మాలధారులు హరి వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. గురువారం టేకులపల్లి ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి హరి వైద్యానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు.

ఆదాయ మార్గమేది?

గ్రామపంచాయతీలకు ఇంటి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. కొత్తగా నిర్మించే ఇళ్లకు నంబర్లు కేటాయించడం, పాతవాటిని ఆధునీకరిస్తే ఇంటి పన్నులు నవీకరించడం వంటి చర్యలు గ్రామపంచాయతీల్లో నిరంతరం సాగే ప్రక్రియ. కానీ అటువంటి చర్యలేవీ గ్రామపంచాయతీల్లో కనిపించడం లేదు. 2018కి పూర్వం నాటి పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేసిన ఇంటి నంబర్ల ఆధారంగా నేడు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ జాబితాలో 2018కి పూర్వ ఇంటి పన్ను చెల్లించిన ఇళ్ల వివరాలు చాలా వరకు నమోదు కాలేదు. కొత్తగా నిర్మించిన ఇళ్లకు అవకాశం దొరకడం లేదు. నిబంధనలను సాకుగా చూపిస్తూ ఉన్నతాధికారులు సైతం కాలం వెళ్లదీస్తున్నారే తప్ప రికార్డుల ఆధునీకీకరణను పట్టించుకోవడం లేదు.



పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

నాటి నిర్లక్ష్యమే.. నేటి రాబడికి ఆటంకం

- గ్రామపంచాయతీల్లో అస్తవ్యస్తంగా ఇంటి నంబర్ల రికార్డు
- రికార్డుల్లో ఒకరి పేరు.. రశీదులో మరొకరి పేరు..
- మార్పులు, చేర్పులకు అవకాశం లేకుండా నిబంధన
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఇల్లెందురూరల్: చిన్న గ్రామపంచాయతీలు ఏర్పడక ముందు ఇల్లెందు మండలంలో ఎనిమిది గ్రామ పంచాయతీలు ఉండేవి. ఆయా పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేశారు. స్వరాష్ట్రంలో ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయడం ప్రారంభించారు. ఈక్రమంలో ప్రభుత్వ నిర్ణయం ఫలితంగా మండలంలో ఎనిమిది గ్రామ పంచాయతీల స్థానంలో 29 గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. అయితే ఇంటి పన్నులకు సంబంధించిన రికార్డును ఈ–గ్రామపంచాయతీలో 2018కి ముందే ఆన్‌లైన్ చేశారు. ఇలా ఆన్‌లైన్ చేసిన జాబితా నూతన పంచాయతీలకు అందింది. 2018 తరువాత ఇంటి పన్నులు వసూలు చేస్తున్న క్రమంలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

అక్రమాలకు సాక్ష్యాలివిగో..

ఒక్కో పంచాయతీ నుంచి వందల సంఖ్యలో ఇంటి నంబర్లు పంచాయతీ రికార్డులలో గల్లంతయ్యాయి. 2018కి ముందు క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లించిన వారి పేర్లు రికార్డుల్లో కనిపించకుండా పోయాయి. గతంలో ఇంటి పన్నులు వసూలు చేసిన అధికారులు, సిబ్బంది చేతివాటం చూపి ఒక్కో ఇంటి నంబర్‌ను పదుల సంఖ్యలో ఇళ్లకు కేటాయించారు. ఇదంతా మాన్యువల్‌గా ఉండటంతో ఎవరూ గుర్తించలేకపోయారు. కానీ ఆన్‌లైన్ ప్రక్రియ అమలు కావడంతో అసలు విషయాన్ని గృహ యజమానులు గుర్తించారు. ఇలా సుభాష్‌నగర్, ఇందిరానగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీలలో వందల సంఖ్యలో ఇంటి నంబర్లు రికార్డులలో గల్లంతయ్యాయి. తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో పూసపల్లి గ్రామంలో వందల సంవత్సరాలుగా నివాసం ఉంటున్న గిరిజనుల ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేసినప్పటికీ ఆన్‌లైన్ రికార్డులలో ఒక్కరి ఇంటి నంబర్ కూడా కనిపించకపోవడం విచిత్రంగా ఉంది. ఇలా మండలంలో అనేక గ్రామాలలో దశాబ్దాలుగా ఇంటి పన్నులు చెల్లించిన వారి పేర్లు గల్లంతు కావడంతో వారంతా ప్రస్తుతం ఇంటి పన్నులు చెల్లించడం లేదు.

అడ్డుగోడలుగా మార్పులు, చేర్పులు..

గ్రామపంచాయతీ ఆన్‌లైన్ రికార్డులలో తమకు గతంలో కేటాయించిన ఇంటినంబర్ వేరొక ఇంటికి కేటాయించినట్లు ఉండటంతో పలువురు గృహ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం మార్పులు, చేర్పులకు అవకాశం ఇచ్చినప్పుడు సరిచేస్తామని గతంలో క్షేత్రస్థాయి అధికారులు హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ ఏజెన్సీ చట్టాలు, ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులకు ఆప్షన్ లేకపోవడంతో ఈ ప్రక్రియ ఐదేళ్లు గడిచినా నేటికీ ముందుకు సాగడం లేదు.

కలగానే కొత్తగా నంబర్ల కేటాయింపు...

గ్రామపంచాయతీలలో కొత్తగా నిర్మించిన ఇళ్లకు ఇంటినంబర్ కేటాయించేందుకు అధికారులు ఏజెన్సీ చట్టాలను అవరోధంగా చూపిస్తున్నారు. కానీ గిరిజనేతరులతోపాటు గిరిజనులకు కూడా కొత్తగా ఇంటి నంబర్లు కేటాయించకపోవడం ఇల్లెందులో పంచాయతీ ఇంటి నంబర్ల రికార్డు అస్తవ్యస్తంగా ఉందనడానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కారణంగా గడిచిన ఐదేళ్లుగా ఇళ్లను నిర్మించుకున్న గిరిజనులు గిరిజనేతరులతోపాటు సేవా పన్ను రశీదు ఆధారంగా ఇళ్లకు కరెంటు మీటరు తీసుకొని తృప్తి పడుతున్నారు.

ఆదాయానికి భారీగా గండి...

గ్రామపంచాయతీలలో 2018కి పూర్వం రికార్డులలో నమోదైన ఇళ్లకు మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. అంతకు ముందు రికార్డులలో ఇంటి నంబర్ల నమోదు ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉండటంతో చాలా ఇళ్ల రికార్డులలో నమోదు కాలేదు. ఇలా మండల వ్యాప్తంగా వెయ్యికి పైగా ఇళ్లు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్వహించిన సర్వేలో వెలుగు చూశాయి. ఇంతేకాకుండా 2008 నుంచి నేటి వరకు కొత్తగా సుమారు రెండు వేల వరకు ఇళ్లు నిర్మించబడినట్లు పంచాయతీ అధికారులు చెపుతున్నారు. ఈ లెక్కన మండల వ్యాప్తంగా మూడు వేల ఇళ్లకు అధికారులు ఇంటి పన్నులు వసూలు చేయకుండా వదిలేస్తున్నారు. ఒక్కో ఇంటికి రూ.500 పన్ను నిర్దేశించుకున్నా రూ.15 లక్షల వరకు గ్రామపంచాయతీలు ప్రతి ఏటా ఇంటి పన్ను రూపంలో ఆదాయం కోల్పోతున్నాయి. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినప్పటికి సరిదిద్దే ప్రయత్నం చేయకపోవడం విచారకరం.



ఆరేళ్లయినా నంబర్‌కు నోచుకోని ఇల్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



మండలంలో ఇంటి నంబర్ల రికార్డు 2018కి పూర్వం అస్తవ్యస్తంగా ఉన్నట్లు సమాచారం ఉంది. 2018 తరువాత ఇంటి నంబర్లు ఈ–గ్రామపంచాయతీలో నమోదయ్యాయి. మార్పులు, చేర్పులు కొత్త వాటిని చేర్చేందుకు చట్టాలు అవరోధంగా ఉన్నాయి. ఈ కారణంగా సేవా పన్ను రశీదుతో ప్రజలకు న్యాయం చేస్తున్నాం. ఇంటి పన్నుల రికార్డు ఆధునికీకరణ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– బాలరాజు, ఎంపీడీఓ, ఇల్లెందు మండలం

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చందర్ సింగ్ తదితరులు

టేకులపల్లి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూస్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను టేకులపల్లికి చెందిన ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు భూక్యా చందర్ సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అభయ హస్తం మేనిఫెస్టో ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, కనీస వేతనం అందజేయాలని, ఇటీవల కాలంలో నియమించిన పంచాయతీ సెక్రటరీలను తక్షణమే క్రమబద్ధీకరించి పూర్తి స్థాయి వేతనాలు చెల్లించాలని, అంగన్‌వాడీ టీచర్లకు నెలవారీ వేతనం రూ.18000లకు పెంచుతూ ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకొచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి భూక్యా ఈశ్వర్ నాయక్, డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బర్మావత్ అరుణ్, టేకులపల్లి మండల కాంగ్రెసు పార్టీ నాయకులు బాణోత్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంపునకు కృషి చేయాలి

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంపునకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఎంపీడీఓ బాలరాజు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ కూలి విధిగా పనులకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలలో నర్సరీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు ఇష్టపడే మొక్కలను పెంచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణాలు వేగవంతంగా సాగేలా నిరంతర పర్యవేక్షణ చూపాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకే కాంప్లెక్స్‌లో షాపులు



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణంలో వీధి వ్యాపారుల కోసం నిర్మించిన కాంప్లెక్స్‌లను కొంతమంది ఆక్రమించుకుని ఇతరులకు కిరాయికి ఇచ్చి నెలనెలా వసూళ్లు చేసుకుంటున్నారని, ఇక మీదట అలాంటి వారికి అవకాశం లేదని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మేనేజర్ అంకుషావలీ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ వీధి వ్యాపారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీతారామా టాకీస్ ఎదురుగా మెయిన్ రోడ్ హైస్కూల్ ప్రహరీ వెంట నిర్మాణం చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌లు కోర్టు కేసులో ఉండడాన్ని ఆసరగా చేసుకుని కొంతమంది రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని రెండు, మూడు గదులు ఆక్రమించుకుని మూడు రోజులు సొంత వ్యాపారాలు కొనసాగించి వాటిని ఇతరులకు కిరాయిలకు ఇస్తున్నారని అధికారుల విచారణలో బయట పడిందన్నారు. ప్రతీ ఒక్కరికి ఒక గదిని కేటాయిస్తామని, అందులో ప్రకటించిన వ్యాపారం చేయకుంటే ఆ గదిని మరొకరికి కేటాయిస్తామని తెలిపారు. ఇక మున్సిపాల్టీకి ప్రతీ నెలా ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్ చెల్లించాలని సూచించారు. కోర్టు కేసు పరిష్కారం అయిన తర్వాత ఇతర గదులు కేటాయించినట్లు వాటిని కూడా రిపేరు చేసి షెట్టర్లు, ఫ్లోరింగ్ చేసి అగ్రిమెంటు చేసి అప్పగిస్తామన్నారు. అంత వరకు ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్ కింద చెల్లించిన వారికి ఒక్కరికి ఒక్కో గదిని కేటాయిస్తామని పేర్కొన్నారు. అంతేగాక అక్కడ మినీ వ్యాన్లు రోడ్లు మీద అడ్డా పెట్టి చిరు వ్యాపారులకు నష్టం కలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీతారామా టాకీస్ గోడ వెంట అడ్డా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే మెయిన్ రోడ్ హైస్కూల్ ఎదుట ఇడ్లీ బండ్లు కూడా తొలిగించి సీతారామా టాకీస్ ఎదురుగా గల ఖాళీగా ఉన్న షెట్టర్ల గదులలోకి మళ్లీస్తున్నట్లు చెప్పారు. హైస్కూల్ ఎదుట వీధి వ్యాపారం చేసుకునేందుకు అనుమతి లేదన్నారు. వీధి వ్యాపారులు సహకరించాలని, తమ షాపుల ముందు పరిశుభ్రత పాటించాలని, ప్రతీ షాపు ఎదుట డస్ట్ బిన్‌లు ఉండాలని సూచించారు. మాకు మున్సిపాల్టీ నుంచి సహాయ సహకారాలు కావాలని, అందుకు తామంతా సహకరిస్తామని వీధి వ్యాపారులు లిఖితపూర్వకంగా అంగీకారం తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీష్ ధన్‌ఖడ్‌ను విపక్ష కాంగ్రెస్ ఎంపీలు అవహేళన చేయడాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ మాట్లాడుతూ... పార్లమెంట్ ఆవరణలో విపక్ష కాంగ్రెస్ ఎంపీలు రాజ్యసభ చైర్మన్‌ను అనుకరిస్తూ వారి హావభావాలను చూపెడుతూ ఎగతాళి చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇది దురదృష్టకరమని ఆ కార్యక్రమాన్ని రాహుల్‌గాంధీ తన మొబైల్‌లో చిత్రీకరించడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించటమేనని విమర్శించారు. అవమానించిన వారిని రాజ్యాంగ పదవుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంపన సీతారామరాజు, ఎడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, వెంకటేశ్వర్లు, జైన్, నరేంద్రబాబు, గొట్టిపోలు శ్రీనివాస్, భిక్షపతి, గోపీకృష్ణ, కుంజా ధర్మ, పైడిపాటి రవీందర్, నాళ్ల సోమసుందర్, చింతలచెర్వు శ్రీనివాసరావు, ఏనుగుల వెంకటరెడ్డి, బిజ్జం శ్రీనివాస్‌రెడ్డి, కేశగాని శ్రీనివాస్‌గౌడ్, జల్లారపు శ్రీనివాస్, లింగంపల్లి రమేష్, బాలాజీ, రామయ్య, నాగరాజు, మహేష్, పసుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఆర్‌ఐ

సుజాతనగర్: క్రిస్మస్ కానుకగా ప్రభుత్వం క్రైస్తవులకు అందజేసిన దుస్తులను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐ కాంతారావు క్రైస్తవ పెద్దలకు గురువారం అందజేశారు. మొత్తం 150 కుటుంబాలకు దుస్తులు వచ్చినట్లు ఆర్‌ఐ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రైస్తవులకు పంపిణీ చేయనున్నట్లు పాస్టర్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎస్‌వీ పాల్, సీహెచ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష మహోన్నతం..



ఇరుముడితో అయ్యప్ప మాలధారులు

ఇల్లెందు: అయ్యప్ప దీక్ష మహోన్నతమైందని గురుస్వాములు కోటి, శ్రీను తెలిపారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద మాలధారులు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ... అయ్యప్ప దీక్ష మహోన్నతమైందని, 41రోజులు మాల ధరించి ఇరుముడితో శబరిమలై వెళ్లి మొక్కులు చెల్లించటంతో మాలధారణ ముగుస్తుందని తెలిపారు.

పత్తి కొనుగోళ్లకు నాలుగు రోజుల సెలవులు

సుజాతనగర్: ఈనెల 23 నుంచి 26 వరకు నాలుగు రోజుల పాటు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు సెలవు ప్రకటించినట్లు కొత్తగూడెం మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. వారాంతం, పండుగలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తిరిగి 27వ తేదీ నుంచి కొనుగోళ్లు మొదలవుతాయని ఆయన తెలిపారు.

పైరవీల యూనియన్లను తరిమేయాలి

సింగరేణి(కొత్తగూడెం): పైరవీలు చేసే యూనియన్‌లను సింగరేణి నుంచి తరిమేసి ఏఐటీయూసీని గెలిపించాలని, యూనియన్ సెంట్రల్ ఆర్గనైజర్ వంగా వెంకట్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కుయుక్తులు పన్ని ఎన్నికలు నిలివేయాలని కోర్టులో పిటిషన్ వేశారని, వాస్తవాలను తెలుసుకున్న గౌరవ హైకోర్టు ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని మందిలించి యధావిధిగా అనుకున్న ప్రకారం ఈనెల 27న సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. రాజకీయ నాయకులను అడ్డం పెట్టుకొని పైరవీలు చేసే సంఘాలకు కార్మికులు బుద్ధి చెప్పాలన్నారు. రమణమూర్తి, రాము, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడతాం..



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ గడియారం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు, డాక్టర్ శంకర్ నాయక్, ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ కోరారు. గురువారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్ గని పిట్ సమావేశ ంలో ఆయన మాట్లాడారు. సింగరేణిని రక్షించేందుకు, అణచి వేయబడుతున్న కార్మికుల హక్కుల కోసం, కార్మికుల బంగారు భవిష్యత్ కోసం ఐఎన్‌టీయూసీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి అందరి చూపు ఐఎన్‌టీయూసీ వైపేనన్నారు. ఏరియాలో చాలామంది ఐఎన్‌టీయూసీలో చేరుతున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థ తెలంగాణకు గుండెకాయలా పనిచేస్తుందని, అటువంటి సింగరేణి సంస్థను గత రాష్ట్ర ప్రభుత్వ పాలకులు నిర్వీర్యం చేసే కుట్రలు చేశారని ఆరోపించారు. ఈనెల 27న సింగరేణిలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలో ఐఎన్‌టీయూసీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

ఘనంగా ఏపీ సీఎం పుట్టినరోజు వేడుకలు



సుజాతనగర్‌లో కేక్ కట్ చేస్తున్న యువకులు

కొత్తగూడెంఅర్బన్: గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం స్థానిక ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. గెర్షోము మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గానూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జగన్మోహన్‌రెడ్డి అందరి మన్ననలు పొందుతున్నారని వివరించారు.

సుజాతనగర్: వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను సుజాతనగర్, సింగభూపాలెం గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పలు కూడళ్లలో కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు.

ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లగొర్ల గోపాలరావు, బత్తిని సాయి, సత్తి, ప్రదీప్‌రెడ్డి, మాసిన శ్రీకాంత్, పి.నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా కుదరని ముహూర్తం!



శిలాఫలకం

సుజాతనగర్: హరిలాల్ తండా గ్రామంలో నిర్మించాల్సిన అంగన్‌వాడీ భవనం శంకుస్థాపన చేసి మూడేళ్లు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఈ భవన నిర్మాణానికి డీఎంఎఫ్ నుంచి రూ.12 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 2019లో అప్పటి ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు భవన నిర్మాణానికి అడుగులు పడలేదు. అయితే భవనానికి కావాల్సిన స్థలం లేకపోవడంతో నిర్మాణం జరగడం లేదని తెలుస్తోంది. సొంత భవనం లేకపోవడంతో అద్దె ఇంట్లోనే అంగన్‌వాడీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో ప్రీ స్కూల్ పిల్లలు 8 మంది, 3 నుంచి ఆరేళ్ల వయసు పిల్లలు 14 మంది, నలుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలు ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మంజూరైన భవనాన్ని త్వరితగతిన నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



సింగరేణి(కొత్తగూడెం): వేడుకలో పాల్గొన్న విక్టర్, దీక్షితులు తదితరులు



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని కార్పొరేట్ సెక్యూరిటీ కార్యాలయంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు కేఎం విక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులు కేక్ కట్ చేసి, క్రిస్మస్ విశిష్టతను వివరించారు. సింగరేణిలో అన్ని మతాలు సమానమని, యాజమాన్యం అందరికీ సమానంగా వారి పండుగలను నిర్వహించుకునేందుకు అడ్వాన్స్ ఇచ్చే సాంప్రదాయం సాగుతోందన్నారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ ప్రేయర్ చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏసీఎంఓ విక్టర్ వందనం, శశిధర్ రాజు, వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్, ఆంతోటి నాగేశ్వరరావు, శ్రీకాంత్, మాల కొండయ్య, బి.సుధాకర్‌రెడ్డి, సకినాల సమ్మయ్య, రమణ, కన్నం సత్యనారాయణ, భిక్షపతి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కేటీపీఎస్ సెవెన్ స్టేజ్ అకౌంట్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా సెవెన్, ఫిఫ్త్ అండ్ సిక్స్ స్టేజ్ చీఫ్ ఇంజనీర్లు పి.వెంకటేశ్వరరావు, ప్రభాకర్ రావు, శ్రీనివాసరావులు హాజరయ్యారు. నాగరాజు, సుహాసిని, విజయ, లెనిన్, గోపాలరావు, గోపాల్, శ్రీను, బూరుగుల భాస్కర్, సంపత్, వినయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.